నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలి

టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ జానకీరాములు

మాట్లాడుతున్న ఎస్ఈ జానకీరాములు

మెదక్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని టీఎస్ఎన్ పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జానకీరాములు ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో గురువారం జిల్లా కార్యాలయం లో విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందించడానికి డిస్కం సిద్ధంగా ఉందన్నారు. రైతులకు గతంలో కంటే మెరుగ్గా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. డిమాండ్‌కు తగిన సరఫరా చేసే సామర్థ్యం ఉన్న విషయా న్ని ప్రజలకు వివరించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తూ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. అధికారులు హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండి.. విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈ కృష్ణారావు, ఏడీ ఈ మోహన్ బాబు, ఏఈ జావేద్ పాల్గొన్నారు.

నేటి నుంచి మెదక్ డిగ్రీ కాలేజీలో జాతీయ సదస్సు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22 : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 23, 24వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో 'స్టేట్ వెల్ఫేర్ పాలసీస్ అండ్ సస్టేబుల్ డెవలప్‌మెంట్ గోల్స్'పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సదస్సుకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ రాజాగౌడ్ వ్యవహరిస్తున్నారు. సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధన విద్యార్థులు, ప్రొఫెసర్లు తమ పరిశోధనా పత్రాలను అందజేయనున్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం, హైదరాబాద్‌లోని ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి, ఆర్టీఐ కమిషనర్ దిలీప్‌రెడ్డి హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు.

నాలుగేండ్లలో రూ.8 కోట్ల రుణాలు మంజూరు

రామాయంపేట, ఫిబ్రవరి 22: రామాయంపేట సొసైటీ పరిధిలోని 29 గ్రామాల్లో నాలుగేండ్లలో దీర్ఘకాలిక రుణాలు రూ.3కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.5కోట్లు మంజూరు చేశామని రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదె చంద్రం తెలిపారు. గురువారం మాట్లాడుతూ రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని అర్హులైన రైతులు ఎప్పుడైనా రుణాలు తీసుకోవచ్చని సూచించారు. సమావేశంలో సొసైటీ సీఈవో నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, ఐలయ్య, వెంకటస్వామిగౌడ్, దుర్గారెడ్డి, శ్రీనివాస్, నిర్మల, లక్ష్మి ఉన్నారు.

వేలంపాటతో మున్సిపాలిటీకి ఆదాయం

మెదక్ పట్టణంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22: జిల్లాకేంద్రంలోని మున్సిపల్ దుకాణాలకు బహిరంగ వేలంపాటతో మున్సిపాలిటీకి ఆదాయం పెరిగిందని కాంగ్రెస్ నాయకులు జీవన్‌రావు, బోజ్జ పవన్, ఆంజనేయులుగౌడ్, ముత్యంగౌడ్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు మాట్లాడారు. మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యంతో ఇప్పటివరకు 17 దుకాణాలకు నెలకు అద్దె కేవలం రూ. లక్ష వచ్చేదన్నారు. ఎమ్మెల్యే చొరవతో వేలంపాట నిర్వహించగా నెలకు రూ.5.13 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. మెదక్‌లోని ప్రధాన చౌరస్తాలను సుందరీకరించడానికి ఎమ్మెల్యే రోహిత్‌రావు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఏడుపాయల దేవస్థానంలో శాశ్వత షెడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను తీర్చడానికి ఎంఎస్ఎస్ సంస్థ ద్వారా బోరుబావుల తవ్వకాలు చేపట్టుతున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

రామాయంపేటలో మొక్క నాటుతున్న రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ సభ్యులు

రామాయంపేట, ఫిబ్రవరి 22: రామాయంపేటలోని మల్లెచెరువు ప్రాంతంలో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్ సభ్యులు హరితహారం నిర్వహించారు. మొక్కలు నాటి, రక్షణగా ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. మొక్కలు కాలుష్యాన్ని తగ్గించి, జీవులకు ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ దేమె యాదగిరి, సభ్యులు లక్ష్మణ్‌యాదవ్, డీజీ శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

10వ వార్డులో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 22 : మున్సిపాలిటీలో చేపడుతున్న డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అధికారులను మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆదేశించారు. గురువారం నర్సాపూర్ లోని 10వ వార్డులో చేపడుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళీ, వార్డ్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, నాయకులు శేఖర్‌గుప్తా, కొండి కుమార్, కృష్ణ, శ్రీకాంత్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎంఎస్ఎస్‌వో ఆర్థిక సాయం

రామాయంపేట, ఫిబ్రవరి 22: నిరాశ్రయుడైన బాధిత కుటుంబానికి ఎంఎస్ఎస్‌వో ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాట్రియాల గ్రామానికి చెందిన గడ్డం రాజయ్య గుడిసె ఈనెల 14న దగ్ధమైంది. ఎమ్మెల్యే రోహిత్‌రావు స్పందించి రూ.25వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. గురువారం బాధితుడికి రమేశ్‌చారి, మహేందర్‌రెడ్డి, సిద్ధిరాములు, నాగులు, చంద్రం, పెంటయ్య, రమేశ్, ఎల్లం ఆర్థిక సాయం అందజేశారు.

ఓటరు నమోదుపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ రాజర్షి షా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలపై ప్రజల్లో చైతన్యం తేవడానికి నియమితులైన ప్రాంగణ రాయబారులకు (క్యాంపస్ అంబాసిడర్) ఎన్నికల సంఘం నిబంధనలు, నియమాలపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రాంగణ రాయబారులకు స్వీప్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై ఒక రోజు శిక్షణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఈసీఐ నిబంధనల ప్రకారం ప్రాంగణ రాయబారి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాంగణ రాయబారులు ఓటింగ్ నమోదుతోపాటు ఈవీఎం, వీవీ ప్యాట్లపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఫామ్-6, 7, 8, 6A, 6B వినియోగిస్తూ ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, పుట్టిన తేదీ, ఫొటో, చిరునామా, ఆధార్ లింక్‌ను నమోదు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ముఖ్యమని, 1 ఏప్రిల్, 2024 వరకు 18 ఏండ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మెదక్ పార్లమెం ట్ ఎన్నికలో వంద శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ ఓటేసేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. చిన్నశంకరంపేటలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన 72మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం గవ్వలపల్లిలో నిర్వహిస్తున్న శివాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్పల్లి గ్రామాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం చందాపూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన భూదయ్య కుటుంబానికి రూ.10వేలు, ఇంటి నిర్మాణం కోసం గౌస్ కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భాగ్యలక్ష్మి, గోపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగానరేందర్, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, సిద్ధిరాములు, యాదవరావు, సిద్ధిరాంరెడ్డి, నాయకులు రాంరెడ్డి, రామచంద్రం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడి ఆశీస్సులు ఉండాలి

పాపన్నపేట, ఫిబ్రవరి 22: భగవంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి గ్రామంలో గురువారం విఠలేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాంధర్‌పల్లి చౌరస్తాలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ నాయకుడి వివాహ వేడుకకు హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నర్సింహులు,ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

మెదక్‌లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

మెదక్ రూరల్, ఫిబ్రవరి 22 : కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు వరమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మెదక్ పట్టణంలోని వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో మెదక్‌మండలానికి చెందిన 231 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రోహిత్‌రావు పంపిణీ చేశారు. అనంతరం బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్ లక్ష్మి, ఎంపీటీసీ ప్రభాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు శ్రీనివాస్‌చౌదరి, బోజ్జా ప్రవీణ్, సుభాష్‌చంద్రబోస్, జీవన్, యాదగిరిగౌడ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

తూప్రాన్‌లో దొంగల హల్‌చల్

తూప్రాన్ టాటాకాఫీ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

- పట్టపగలే దొంగతనాలు
- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

తూప్రాన్, ఫిబ్రవరి 22: తూప్రాన్‌లో దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా వరుస చోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం అర్ధరాత్రి మొదలు గురువారం మధ్యాహ్నం వరకు రెండు ఏటీఎంలు, నాలుగిండ్లలో చోరీలకు పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన తిరుమలరావు తన కుటుంబంతో కలిసి టాటా కాఫీ కాలనీలో నివాసముంటున్నాడు. తిరుమల రావు భార్య ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నది. గురువారం ఉదయం తన భార్య ఉమారాణిని పాఠశాల వద్ద దిగబెట్టి, ఇతర పనులు చూసుకుని ఇంటికొచ్చాడు. గేటుకు వేసిన తాళం అలాగే ఉంది. తాళం తీసి ఇంట్లోకి వెళ్లిన ఆయనకు ఇంటి తలుపు వేసినట్టుగానే ఉండగా ఇంటికి వేసిన తాళం కనిపించలేదు. డోర్ తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో దాచిన 2.8 తులాల బంగారు గాజులు, 2.8 తులాల నాలుగు వరుసల బంగారు చంద్రహారం, 1.6 తులాల బంగారు రింగులు, ఒక జత బంగారు కమ్మలు, 13 గ్రాముల రెండు వరుసల బంగారు గొలుసు, 1.5 తులాల బంగారు లాకెట్ మొత్తం కలిపి 10.6 తులాల బంగారు వస్తువులతో పాటు రూ.10 వేల నగదు కనిపించలేదు. దీంతో తన భార్యకు ఫోన్ చేసి ఆభరణాల గురించి ఆరా తీశాడు. ఇంటికి చేరుకున్న ఆమె తమ ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

మరో చోట రూ.80 వేల ఆభరణాలు

తూప్రాన్ పట్టణానికి చెందిన సమ్యా సుల్తానా బుధవారం పని నిమిత్తం కామారెడ్డికి వెళ్లింది. తన పెద్ద కొడుకు ఆరిఫ్ ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో పడుకున్నాడు. గురువారం ఉదయం ఆరిఫ్ ఇంటికెళ్లి చూడగా తాళం పగులగొట్టబడి ఉంది. దీంతో పాటు వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో తన తల్లి సుల్తానాకు ఫోన్ ద్వారా సమాచార మందించాడు. సుల్తానా ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచి ఉంచిన 3 తులాల బంగారు ఆభరణాలతోపాటు, రూ.20 వేల నగదు కనిపించలేదు. అదేరోజు ఇంటి పక్కన ఉన్న నాగరాజు, రాజు, బేగం ఇండ్లలోనూ దొంగలు చోరీకి యత్నించగా, ఏమీ దొరకలేదని తెలిసింది. బాధితురాలు సుల్తానా పోలీసులకు ఫిర్యాదు చేసింది. షష్మద్ అనే మహిళ బుధవారం ఇంటికి తాళం వేసి తన ఆడబిడ్డ ఇంటికి వెళ్లగా, బుధవారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టారు. గురువారం ఉదయం ఇంటి ఎదురుగా ఉండే ఏసుబాబు ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని ఆమెకు తెలుపగా, వచ్చి చూడగా తన ఇంట్లో దాచిన అరతులం బంగారంతో పాటు రూ.50 వేల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించింది. దీంతోపాటు తన ఇంటి సమీపంలో ఉండే భాగ్య ఇంట్లో చొరబడి రూ.10 వేల నగదు 20 తులాల పట్టగొలుసులు దొంగిలించినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పోతరాజ్‌పల్లి వద్ద బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంల వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎంలోకి రాళ్లు విసిరిన సీసీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. అక్కడ ఏమీ చోరీజరగలేదు. ఏటీఎంపై రాళ్లు విసిరిన వ్యక్తికి మతి స్థిమితం లేదని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు వరుస దొంగతనాలపై పోలుసులు ప్రత్యేక దృష్టిసారించి దర్యాప్తును ముమ్మరం చేశారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవాలు

చేగుంట : కర్నాల్‌పల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో శివపార్వతుల కల్యాణం

చేగుంట/ చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని కర్నాల్‌పల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం గణపతి పూజ, యాగశాల ప్రవేశం, శివపార్వతుల కల్యాణం, హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకుడు అంబటి ఆంజనేయులు, చైర్మన్ బచ్చు రమేశ్‌గుప్తా, కమిటీ సభ్యులు కేఆర్ మధుసూదన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, యాదిరెడ్డి, యాదగిరి, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సంతోష్, ప్రభాకర్‌రెడ్డి, నగేశ్, భూపతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శివాలయంలో

చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో శివాలయ ద్వితీయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో గణపతిపూజ, లింగార్చన, కుంకుమార్చన, పుష్పార్చన, చండీహోమం ఇతర కార్యక్రమాలను అర్చకుడు సంతోషశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగానరేందర్, మాజీ ఉపసర్పంచ్ రామిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట : గవ్వలపల్లి శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం ప్రకాశ్

చేగుంట, ఫిబ్రవరి 22 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీపీఎం ప్రకాశ్ అన్నారు. చేగుంటలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ ఆధ్వర్యంలో గురువారం చేగుంట, నార్సింగి మండలాల్లోని వీవోఏలు, సీసీలకు శిక్షణ ఇచ్చారు. మహిళలు లక్షాధికారులు కావాలన్నదే లక్ష్యమన్నారు. మహిళలు ఆదాయాన్ని పెంచుకొని, వ్యాపారంలో ముందుండాలని సూచించారు. సమావేశంలో సీసీలు, శంకర్, సుల్తానా, స్వామి, రామస్వామితోపాటు వీవోఏ లీడర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి: డీఈవో

మెదక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో రాధాకిషన్

నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల-2లో

పాపన్నపేట ఉన్నతపాఠశాలలో..

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ కార్యక్రమానికి డీఈవో రాధాకిషన్ హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించి, భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మండల విద్యాధికారి నీలకంఠం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వపరిపాలన

నర్సాపూర్/ పాపన్నపేట, ఫిబ్రవరి 22 : నర్సాపూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల-2, పాపన్నపేట మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. నర్సాపూర్ పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎంలాలు, ఉపాధ్యాయులు వాణిశ్రీ, కేవీఆర్, మోహన్‌రావు, సునీత, అస్రాసాహిన్, బుష్రాఫాతిమా, ఇంతియాజ్ అలీఖాన్ తదితరులు బహుమతులు అందజేశారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు బగలాముఖి శక్తిపీఠం ఆహ్వానం

మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శాస్త్రుల వెంకటేశ్వరశర్మ

శివ్వంపేట, ఫిబ్రవరి 22: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠం అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ తెలిపారు. ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి శ్రీధర్‌బాబును గురువారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

చిన్నచింతకుంట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు

నర్సాపూర్, ఫిబ్రవరి 22 : మందుబాబులు ప్రభుత్వ పాఠశాలను అడ్డాగా చేసుకొని వైన్స్‌గా మార్చారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నచింతకుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మందుబాబులు అడ్డాగా చేసుకొని రాత్రి సమయంలో మద్యం సేవిస్తున్నారు. ఖాళీ సీసాలను పగలగొట్టి పాఠశాల ఆవరణాన్ని అపరిశుభ్రం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఒకరి ఆత్మహత్య

డాకి రమేశ్(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 22: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మల్లె చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాలు.. రామాయంపేటలోని దుర్గమ్మ బస్తీకి చెందిన డాకి రమేశ్(32) కొంతకాలంగా అప్పులబాధతో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సమస్యలతో రెండు రోజుల క్రితం రమేశ్ ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. గురువారం స్థానిక మల్లె చెరువులో రమేశ్ మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

మార్చి 6న తైబజార్ వేలం

రామాయంపేట, ఫిబ్రవరి 22 : రామాయంపేట తైబజార్‌ను మార్చి 6న వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. 2024-25 సంవత్సరానికి తైబజార్‌ను మార్చి 6న మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేయాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి 22 : ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన జగదీశ్వరాచారిని గురువారం ఎంపీపీ స్వరూప తమ కార్యాలయంలో సన్మానించారు. గతంలో వెల్దుర్తి ఎంపీడీవోగా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్లిన జగదీశ్వరాచారి తిరిగి వెల్దుర్తికి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చించారు. నిధుల మంజూరుపై అధికారులపాటు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, శంకర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బావిలో పడి మహిళ మృతి

టేక్మాల్, ఫిబ్రవరి 22: మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన మహిళ పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎల్లంపల్లికి చెందిన కొండి అనిత (35) మేకలను మేపడానికి బుధవారం గ్రామ సమీపంలోని బావి వద్దకు వెళ్లింది. తాగునీటి కోసం వెళ్లిన అనిత ప్రమాదవశాత్తు జారిపడి బావిలో పడింది. అనిత వెంట వెళ్లినవారు విషయాన్ని గ్రామస్తులకు చెప్పారు. బుధవారం రాత్రి వరకు బావిలో గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం ఉదయం గజ ఈతగాళ్లు అనిత మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనిత మృతదేహం